www.suryaa.com
స్పోర్ట్స్
sports@suryaa.com

# 12వ ప్రపంచ కప్ హాకీ సమరం

న్యూఢిల్లీ: ఫిబ్రవరి 28 - మార్చి 13



సూర్య
హైదరాబాద్
బుధవారం
10 మార్చి10





# సెమీస్‌లో జర్మనీ

### 5-2తో కివీస్‌పై ఘనవిజయం ● పూల్-ఎలో అగ్రస్థానం

న్యూఢిల్లీ: జర్మనీ ప్రపంచకప్ హాకీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళ వారం పూల్-ఎలో జరిగిన తొలి మ్యాచ్‌లో జర్మనీ 5-2 గోల్స్ తేడాతో న్యూజి లాం డ్‌ను ఓడించి సెమీస్ బెర్త్‌ను దక్కించుకొంది. ప్రారంభం నుంచే జర్మనీ ఎటాకింగ్ గేమ్‌తో కివీస్‌ను హడలెత్తించింది. సమన్వయంతో ఆడుతూ ప్రత్యర్థి గోల్ పోస్ట్‌లోకి చొచ్చుకొని పోయేందుకు ప్రయత్నించింది. వరుస దాడులతో ప్ర త్యర్థి జట్టును ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆట 15వ నిమిషంలో క్రిస్టో ఫర్ జర్మనీకి తొలి గోల్ అందించాడు. మరో 8 నిమిషాల తర్వాత జర్మనీకి మరో ఛాన్స్ లభించింది. అయితే గోల్స్ చేసే అవకాశాన్ని తృటిలో చేజార్చుకుంది. అయితే 28వ నిమిషంలో ఫ్లోరియన్ ఫుచ్స్ జట్టుకు మూడో గోల్ అందించాడు. దీంతో తొలి అర్ధ భాగంలో జర్మనీ 2-0 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థంలో కూడా డిఫెండింగ్ ఛాంపియన్ జోరు కొనసాగింది. మరోవైపు న్యూజిలాండ్ కూడా ఎటాకింగ్ గేమ్ ఆడింది. దీంతో మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది.

47వ నిమిషంలో ఫిలిప్ విట్ జర్మనీకి మూడో గోల్ అందించాడు. ఈ సమ యంలో కివీస్ విజృంభించింది. 50వ నిమిషంలో మికాలిస్ జట్టుకు తొలి గోల్ అందించాడు. పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసిని మికాలిస్ జట్టుకు గోల్ సాధించి పెట్టాడు. మరో 4నిమిషాల తర్వాత నికోలస్ కివీస్‌కు రెండో గోల్ అందిం చాడు. దీంతో జర్మనీ ఆధిక్యం 3-2కు తగ్గింది. అంతేగాక మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది. ఈ షాక్ నుంచి తేరుకున్న ప్రపంచ ఛాంపియన్ జర్మనీ వెంటవెంటనే మరో రెండు గోల్స్ సాధించి ఘన విజయం అందుకొంది. 63వ నిమిషంలో మోరిట్జ్ ఫుర్స్టె, 64వ నిమిషంలో మాథ్యూస్ విథాస్ జట్టుకు గోల్స్ సాధించి పెట్టారు. ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకున్న జర్మనీ 5-2తో గెలిచి సెమీస్‌కు చేరుకొంది.

## పూల్-ఎ పాయింట్ల పట్టిక

| దేశం | మ్యాచ్‌లు | వి | ఓ | డ్రా | పా. | చే.గో | ఇ.గో | తేడా |
|---|---|---|---|---|---|---|---|---|
| జర్మనీ | 5 | 3 | 0 | 1 | 11 | 19 | 9 | 12 |
| నెదర్లాండ్స్ | 5 | 3 | 1 | 1 | 10 | 15 | 5 | 10 |
| కొరియా | 5 | 3 | 1 | 1 | 10 | 16 | 8 | +8 |
| అర్జెంటీనా | 5 | 2 | 3 | 0 | 6 | 8 | 11 | -3 |
| న్యూజిలాండ్ | 5 | 2 | 2 | 0 | 6 | 8 | 12 | -4 |
| కెనడా | 5 | 0 | 5 | 0 | 0 | 6 | 27 | -21 |

వి: విజయం, ఓ: ఓటమి, పా: పాయింట్లు, ఇ.గో: ఇచ్చిన గోల్స్, చే.గో: చేసిన గోల్స్

## పూల్-బి పాయింట్ల పట్టిక

| దేశం | మ్యాచ్‌లు | వి | ఓ | డ్రా | పా. | చే.గో | ఇ.గో | తేడా |
|---|---|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 5 | 4 | 1 | 0 | 12 | 23 | 6 | +17 |
| ఇంగ్లాండ్ | 5 | 4 | 1 | 0 | 12 | 17 | 12 | +5 |
| స్పెయిన్ | 5 | 3 | 2 | 0 | 9 | 12 | 8 | +4 |
| **భారత్** | 5 | 1 | 3 | 1 | 4 | 13 | 18 | -5 |
| దక్షిణాఫ్రికా | 5 | 1 | 3 | 1 | 4 | 14 | 28 | -14 |
| పాకిస్థాన్ | 5 | 1 | 4 | 0 | 3 | 9 | 16 | -7 |

వి: విజయం, ఓ: ఓటమి, పా: పాయింట్లు, ఇ.గో: ఇచ్చిన గోల్స్, చే.గో: చేసిన గోల్స్

# ఫలితమివ్వని గెలుపు

న్యూఢిల్లీ: నెదర్లాండ్స్‌తో జరిగిన పూల్-ఎ రెండో మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2-1 తేడాతో విజయం సాధించి నా సెమీస్ బెర్త్‌ను దక్కించుకోలేక పోయింది. ఈ మ్యాచ్‌లో ఓడినా గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ సెమీస్‌కు చేరుకొంది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కొరియా చిరస్మరణీయ విజయాన్ని అందుకొంది. అద్భుత ఆటతో పటిష్టమైన హాలెండ్‌ను ఓడించింది. ప్రారంభం నుంచే రెండు జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడ్డాయి. ఆట మొదటి నిమిషంలోనే రొనాల్డ్ బ్రౌవర్ నెదర్లాండ్స్‌కు తొలి గోల్ అందించాడు. ప్రారంభంలో కాస్త వెనుకబడ్డ కొరియా తర్వాత తేరుకొంది. ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌వైపు పదేపదే దాడులు చేసి ఉక్కిరిబిక్కిరి చేసింది. మరో నాలుగు నిమిషాల్లో తొలి అర్ధభాగం ముగుస్తుందనగా కొరియాకు మొదటి గోల్ లభించింది. స్టార్ ఆటగాడు వూ నామ్ హ్యూన్ ఈ గోల్ సాధించాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది. ద్వితీయార్థంలో రెండు జట్లు విజృంభించి ఆడాయి. అయితే గోల్స్ చేయడంలో మాత్రం విఫలమయ్యాయి. 45వ నిమిషంలో జాంగ్



హోసి కొరియాకు రెండో గోల్ అందించాడు. దీన్ని చివరివరకు కాపాడుకున్న కొరియా 2-1 తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో గెలిచినా ప్రయోజనం లేకుండా పోయింది. గోల్స్‌లో పైచేయి సాధించిన నెదర్లాండ్స్ సెమీస్‌లో ఆస్ట్రేలియాతో తలపడుతోంది. మరో సెమీస్‌లో జర్మనీ-ఇంగ్లాండ్‌తో ఢీకొంటుంది.

# అర్జెంటీనా జయకేతనం

న్యూఢిల్లీ: కెనడాతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనా 4-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. రెండు జట్లు ఇప్పటికే సెమీస్ బెర్త్ నుంచి తప్పుకోవడం ఈ మ్యాచ్ నామమాత్రంగా జరిగింది. ఆడిన అన్ని మ్యాచుల్లో ఓడిన కెనడా పూల్-ఎలో చిట్టచివరి స్థానంలో నిలిచింది. ప్రారంభంలో కెనడా అద్భుత ఆటతో అర్జెంటీనాకు గట్టిపోటీ ఇచ్చింది. దీంతో గోల్స్ కోసం అర్జెంటీనా తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కెనడా ఆటగాళ్లు సమన్వయంతో ఆడి ప్రథమార్ధంలో చాలా సేపటి వరకు ప్రత్యర్థికి గోల్ కాకుండా అడ్డుకున్నారు. అయితే 29వ నిమిషంలో అర్జెంటీనా నిరీక్షణ ఫలించింది. స్టార్ ఆటగాడు లుకాస్ మార్టిన్ విల్లా జట్టుకు తొలి గోల్ అందించాడు. దీంతో విరామ సమయానికి జట్టు 1-0 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ రెండు జట్లు హోరాహోరీగా పోరాడాయి. అయితే 43వ నిమిషంలో ఎన్రిక్ జట్టుకు అర్జెంటీనాకు రెండో గోల్ అందించాడు. 56వ నిమిషంలో నికోలస్ చేసిన గోల్‌తో జట్టు ఆధిక్యం



3-0కు పెరిగింది. ఈ సమయంలో కెనడా వెంటవెంటనే రెండు గోల్స్ చేసింది. 60వ నిమిషంలో స్కాట్ టూపర్ కెనడాకు తొలి గోల్ అందించాడు. మరో ఐదు నిమిషాల తర్వాత డేవిడ్ రెండో గోల్ చేశాడు. దీంతో అర్జెంటీనా ఆధిక్యం 3-2కు తగ్గింది. తర్వాత కూడా కెనడా వరుస దాడులతో స్కోరును సమం చేసేందుకు ప్రయత్నించింది. అయినా ఫలితం లేకుండా పోయింది. చివరి నిమిషంలో టొమాస్ చేసిన గోల్‌తో అర్జెంటీనా 4-2 తేడాతో విజయం అందించింది. ఈ గెలుపుతో అర్జెంటీనా పూల్-ఎలో నాలుగో స్థానంలో నిలిచింది.

## ఆటతీరు మారాలి: సోహైల్

న్యూఢిల్లీ: ఒకప్పుడూ ప్రపంచ హాకీని శాసించిన భారత్, పాకిస్థాన్ జట్లు రోజురోజుకు తీసికట్టుగా తయారుకావడం ఆందోళన కలిగించే విషయమని పాక్ స్టార్ ఆటగాడు సోహైల్ అబ్బాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్లుగా వెలుగువెలిగిన ఆసియా దిగ్గజాల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారిందన్నాడు. పరిస్థితులకు అనుకూలంగా ఆటను తీరును మార్చుకోక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నాడు. ఈసారి ప్రపంచ కప్‌లో ఇరు జట్ల ఆట అధ్వాన్నంగా ఉందన్నాడు. రెండు జట్లకు కూడా సమర్థవంతమైన కోచ్‌ల అవసరం ఉందని చెప్పాడు. ముఖ్యంగా కొంతకాలంగా పేలవంగా ఆడుతున్న పాక్ తక్షణమే విదేశీ కోచ్‌ను నియమించుకోవాలన్నాడు. ఇటువంటి పరిస్థితి కొనసాగితే ప్రపంచ హాకీలో పాక్ కనుమరుగు కావడం ఖాయమన్నాడు. ప్రస్తుతం అన్ని విభాగాల్లో నైపుణ్యం ఉంటేనే హాకీలో రాణించే అవకాశం ఉందన్నారు. డిఫెన్స్, పెనాల్టీ కార్నర్స్, ఎటాకింగ్ అంశాల్లో సత్తాకలిగిన ఆటగాడే హాకీలో రాణించగలుగుతాడన్నాడు. యూరోపియన్ జట్ల విజయ రహస్యం ఇదేనన్నాడు. వారు అన్ని విభాగాల్లో మెరుగ్గా రాణించడం వల్లే నేడు ప్రపంచ హాకీని శాసిస్తున్నారన్నాడు.

# ఆసీస్‌కు రెండో గెలుపు

హామిల్టన్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బ్రాడ్‌హడిన్ అద్భుత సెంచరీ సాధించడంతో 246 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ మరో 16 బంతులు మిగిలివుండగానే 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 46.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. టేలర్ అత్యధికంగా 62 పరుగులు చేశాడు. మిగతావారిలో స్టయిరీస్ 41, హాప్‌కిన్స్ 45 పరుగులు చేశారు. ప్రత్యర్థి జట్టులో హాఫ్స్, జాన్సన్ మూడేసి వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌ను హడిన్ సెంచరీతో ఆదుకున్నాడు. ప్రారంభంలోనే నిదానంగా ఆడిన హడిన్ తర్వాత చెలరేగి పోయాడు. 121 బంతుల్లోనే 5సిక్స్‌లు, 7ఫోర్లతో 110 పరుగులు చేశాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన పాంటింగ్ 9ఫోర్లతో 69 పరుగులు సాధించాడు. సునాయాస విజయం సాధించిన ఆసీస్ సిరీస్‌లో 2-1 ఆధిక్యాన్ని సాధించింది.



# క్రీడల్లో శక్తిమంతుడు సచిన్

ముంబయి: భారత క్రీడలను ప్రభావితం చేసిన వారిలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ప్రథమ స్థానంలో నిలిచాడు. దేశ క్రీడారంగంపై చెరగని ముద్రవేసిన వారిలో సచిన్ మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకొని రికార్డుల రారాజుగా వెలుగొందుతున్న సచిన్ భారత క్రీడల్లోనే అత్యంత శక్తిమంతుడిగా ఎంపికయ్యాడు. రికార్డుల మీద రికార్డులతో హోరెత్తిస్తున్న సచిన్ ఇటీవలే వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఇప్పటికే టెస్టులు, వన్డేల్లో అత్యధిక సెంచరీలు, అత్యధిక పరుగులు సాధించిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. మరోవైపు ఐపీఎల్‌ను సృష్టించిన పొట్టి క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చిన లీగ్ ఛైర్మన్ లలిత్‌మోడీ క్రీడలను ప్రభావితం చేసిన వ్యక్తుల్లో రెండో స్థానంలో నిలిచారు. ఆయన తర్వాతి స్థానాన్ని లిక్కర్ కింగ్, బెంగళూర్ రాయల్ ఛాలెంజర్స్ అధినేత విజయ్ మాల్యా దక్కించుకున్నారు. ఐసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి శరద్ పవార్ నాలుగో స్థానంలో నిలిచారు. భారత సారథి ధోనీ ఐదో, బీసీసీఐ అధ్యక్షుడు శశాంక్ మనోహర్ ఆరో స్థానాన్ని దక్కించుకున్నారు. ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించిన షూటర్ అభినవ్‌బింద్రా 41వ, టెన్నిస్ స్టార్ సానియా మీర్జా 50వ స్థానంలో నిలిచారు. క్రీడల్లో అత్యంత ప్రభావంతులుగా నిలిచిన వారిని ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.



మాస్టర్ బ్లాస్టర్ సచిన్‌ను సన్మానిస్తున్న సినీనటి శిల్పాషెట్టి

## హాల్ ఆఫ్ ఫేమ్‌లో కపిల్



దుబాయి: భారత మాజీ క్రికెట్ కెప్టెన్, డాషింగ్ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ ప్రతిష్టాత్మకమైన హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు పొందాడు. కపిల్ సారథ్యంలో భారత్ 1983లో ప్రపంచకప్ గెలుచుకొంది. అనామక జట్టుగా బరిలోకి దిగిన భారత్ ఆ ప్రపంచకప్‌లో సంచలన విజయాలతో కప్‌ను దక్కించుకొంది. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్‌లలో ఒకడిగా వెలుగొందిన కపిల్ భారత క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చాడు. కపిల్ 131 టెస్టుల్లో, 225 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఐసీసీ అధ్యక్షుడు డేవిడ్ మోర్గాన్ ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో కపిల్‌కు హాల్ ఆఫ్ ఫేమ్ క్యాప్ బహూకరించారు.

### జడేజా లేకపోవడం లోటే: వార్న్

జైపూర్: ప్రతిభావంతుడైన రవీంద్ర జడేజా సేవలు అందుబాటులో లేకపోవడం జట్టుకు లోటేనని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ షేన్‌వార్న్ అన్నాడు. రెండో సీజన్‌లో పేలవంగా ఆడిన తాము భారత్‌లో జరిగే మూడో అంచెలో మెరుగ్గా రాణిస్తామన్నారు. ఆల్‌రౌండర్ జడేజా అత్యంత ప్రతిభావంతుడని, అతని స్థానాన్ని పూడ్చడం తేలికకాదన్నాడు. అయితే అతను లేకున్నా తాము మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నాడు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు కొదవలేదన్నాడు. ఈ సీజన్‌లో యూసుఫ్ పఠాన్ తమ తరుపుముక్క అన్నాడు. అతను గాడిలో పడితే ప్రత్యర్థి జట్లకు ఇబ్బందులు తప్పవన్నాడు.




## సాధనే.. సాధన

బెంగళూర్: ఐపీఎల్-3 సమీపిస్తుండంతో అన్ని జట్లు సాధనలో మునిగి తేలుతున్నాయి. బెంగళూర్‌లో రాయల్ ఛాలెంజర్స్, చెన్నైలో సూపర్ కింగ్స్, ఉప్పల్‌లో దక్కన్ ఛార్జర్స్, జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబయిలో ఇండియన్స్ జట్లు సాధన చేస్తున్నాయి. మరోవైపు కోల్‌కతాలో నైట్ రైడర్స్, మొహాలిలో పంజాబ్ కింగ్స్ లెవన్ జట్లు ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఛార్జర్స్ తన అన్ని మ్యాచ్‌లు ఇతర వేదికల్లో ఆడాల్సి ఉంది. అయితే ఛార్జర్స్ తన ప్రాక్టీస్‌ను ఉప్పల్‌లో కొనసాగించింది. సారథి గిల్‌క్రిస్ట్, కోచ్ లెహమాన్ పర్యవేక్షణలో ఛార్జర్స్ సాధన కొనసాగించింది. చెన్నై సూపర్‌కింగ్స్ కూ డా తీవ్ర సాధన చేస్తోంది. ధోనీ నేతృత్వంలో జట్టు కఠోర సాధనలో నిమగ్నమైంది.



## ఐపీఎల్‌కు సర్వం సిద్ధం

జైపూర్: ఐపీఎల్ మూడో సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని లీగ్ ఛైర్మన్ లలిత్ మోడీ అన్నారు. మార్చి 12న ప్రారంభమయ్యే మెగా టోర్నీకి ఆదరణ లభిస్తోందనే నమ్మకం ఉందన్నారు. అభిమానులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముమ్మర ఏర్పాట్లు చేశామన్నారు. టోర్నీకి ఎటువంటి అవరోధాలు ఎదురుకావనే తాను భావిస్తున్నానని, చిన్నపాటి ఇబ్బందులు ఉన్నా దాన్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. దేశంలోని టివి ఛానల్స్ తమ పంథాను వీడి టోర్నీకి ప్రచారం కల్పిస్తాయనే ధీమాను వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ కోరిన విధంగా తాము అన్నింటికి సమ్మతం వ్యక్తం చేసినా వారు మళ్లీ పాత పాట పాడుతున్నారన్నారు. ఇది తమను బాధించిందన్నారు. టోర్నీ ప్రారంభం నాటికి అన్ని సర్దుకుపోతాయనే నమ్మకం ఉందన్నారు. ఐపీఎల్-3 సీజన్‌లో పాల్గొనే అన్ని జట్లకు భారీ భద్రత కల్పిస్తామన్నారు.




ఐపీఎల్-2 సీజన్‌లో దక్కన్ ఛార్జర్స్ సాధించిన చిరస్మరణీయ విజయాలపై రూపొందించిన ప్లాటినమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గిల్‌క్రిస్ట్, లెహమాన్ తదితరులు

- చర్చల్లోకి సోనియాను తెచ్చే యత్నం
- టీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టే వ్యూహం
- రెండు పార్టీల మధ్య పోరు ఉండాలన్న ఎత్తుగడ
- లోక్‌సభలో టీఆర్ఎస్ పోరాటంపై రికార్డుల సేకరణ?
- తెలంగాణ సమస్యలపై గత పోరాటాల ప్రచారం
- టీడీపీ కొత్త వ్యూహం

# టార్గెట్ కాంగ్రెస్!

(సూర్య ప్రధాన ప్రతినిధి)

ఇందిరాపార్కు వద్ద జరిగిన ఘటన అనంతర పరిణామాలతో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తులో తెలంగాణలో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేసుకుంటోంది. తెలంగాణ సమస్యకు ప్రధాన కారణమైన కాంగ్రెస్, ఆ పార్టీతో పరోక్ష సంబంధాలు పెట్టుకుందని భావిస్తున్న టీఆర్ఎస్‌ను దెబ్బకొట్టే ద్విముఖ వ్యూహంతో టీడీపీ నాయకత్వం అడుగులు వేస్తోంది. ప్రధానంగా తెలంగాణపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వ్యూహాత్మక మౌనాన్ని ప్రశ్నించడం ద్వారా తెలంగాణలో ఇకపై జరిగే పోరాటాన్ని కాంగ్రెస్-టీడీపీలకే పరిమితం చేయాలని భావిస్తోంది. ఇప్పటివరకూ వ్యూహాత్మక మౌనం వహిస్తున్న టీడీపీ ఇకపై దానిని పక్కకుపెట్టి ఆరెండు పార్టీలపై ఎదురుదాడి చేయాలని నిర్ణయించుకుంది. దానికోసం కొందరు నాయకులకు బాధ్యతలు అప్పచెప్పాలని భావిస్తోంది.

### సోనియాదే బాధ్యత

'జాక్'లో భాగస్వామి కావడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనే అంశంలో తమ పార్టీ నాయకులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ, తమ పార్టీని ఇరికించేందుకు టీఆర్ఎస్- జాక్ కన్వీనర్ కోదండరామ్ ద్వారా కాంగ్రెస్ పావులు కదుపుతోందని గ్రహించిన టీడీపీ నాయకత్వం, ఇకపై తాము కూడా ఆ మేరకు అడుగులు వేయాలని నిర్ణయించుకుంది. సీమాంధ్ర వస్తువుల బహిష్కరణ పేరుకేనని, అసలు లక్ష్యం హెరిటేజ్ మాత్రమేనని భావిస్తోంది. అందులో భాగంగా ఇప్పటివరకూ తెలంగాణపై ఒక్క ప్రకటన కూడా చేయకుండా మౌనంగా ఉన్న సోనియాగాంధీని చర్చల్లోకి తీసుకురావడం ద్వారా, కాంగ్రెస్ పార్టీనే ఈ సమస్యకు ప్రధాన కారణమన్న సంకేతాలు ప్రజల్లోకి పంపించనుంది.

### తెరపైకి మళ్లీ రాజ్యాంగ సంక్షోభం ప్రస్తావన

కాంగ్రెస్ నాయకులు తరచూ చెబుతున్న తెలంగాణ ఇచ్చేదీ- తెచ్చేదీ తామేనన్న ప్రచారాన్ని ప్రజలముందు ప్రముఖంగా ప్రస్తావించేందుకు టీడీపీ సిద్ధమవుతోంది. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు సోనియాపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేకపోతున్నారని, తెలంగాణ విషయంలో సోనియాగాంధీ ఇప్పటివరకూ బహిరంగప్రకటన ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించనుంది. ఈ విషయంలో టీఆర్ఎస్ మౌనాన్ని కూడా నిలదీయనుంది. తెలంగాణ రాకపోవడానికి సోనియాగాంధీతో పాటు, తెలంగాణ ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలే కారణమన్న ప్రచార వ్యూహంతో ఎదురుదాడికి సిద్ధం కానుంది. తమ పార్టీకి చెందిన 38 మంది ఎమ్మెల్యేలు జేఏసీలో చేరకముందే రాజీనామాలు చేశారని, కాంగ్రెస్‌కు చెందిన 50 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, రాజ్యాంగ సంక్షోభం సృష్టిస్తే తప్ప తెలంగాణ రాదని ప్రజలకు వివరించనుంది. కేవలం తాము మాత్రమే రాజీనామాలు ఆమోదింపచేసుకుంటే వచ్చేది ఉప ఎన్నికలే తప్ప, తెలంగాణ కాదని విస్పష్టంగా చెప్పనుంది.



### తప్పులేదన్న ప్రచారం

తెలంగాణ ప్రజల దృష్టిలో తమ పార్టీని, అధినేతను దోషిగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్-టీఆర్ఎస్‌ను ఒకేసారి దెబ్బకొట్టేందుకు సైతం ప్రణాళిక రూపొందిస్తోంది. తెలంగాణకు అనుకూలంగా ప్రణబ్ కమిటీకి ఇచ్చిన లేఖను తమ పార్టీ వెనక్కి తీసుకోలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూడా మార్చుకోలేదని గుర్తు చేయనుంది. కానీ, టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయలేదని, పార్లమెంటు సమావేశాలు జరుగుతుంటే అక్కడికి వెళ్లి రాజీనామాలు ఆమోదించుకోకుండా హైదరాబాద్‌లో ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించనుంది.

### పాత పోరాటాల ప్రస్తావన

తెలుగుదేశం పార్టీ తెలంగాణకు వ్యతిరేకమన్న కాంగ్రెస్-టీఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు గతంలో తెలంగాణ సమస్యలపై పార్టీ చేసిన పోరాటాన్ని మరోసారి ప్రజల దృష్టికి తీసుకువెళ్లనుంది. బాబ్లీపై మహారాష్ట్ర సర్కారు అక్రమ కట్టడాలు నిర్మించిన సందర్భంలో రెండుసార్లు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశామని, బీడీకట్టలపై పుర్రె గుర్తులు ముద్రించినందుకు నిరసనగా, గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ ఢిల్లీలో ధర్నాలు చేసిన విషయాన్ని గుర్తు చేయనుంది. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేసిన ఘనత తమ పార్టీదేనని ప్రస్తావించనుంది. బీడీ కట్టలపై పుర్రె గుర్తు వేసినప్పుడు కేసీఆర్ కేంద్ర కార్మికమంత్రిగా ఉన్న విషయాన్ని ప్రముఖంగా ప్రచారం చేయనుంది.

### టీఆర్ఎస్ ఎంపీల రికార్డుల సేకరణ

ఇదిలాఉండగా, తెలంగాణ కోసం పోరాటం చేస్తున్నామని చెప్పుకునే కేసీఆర్, గతంలో ఆ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంటులో ఎన్నిసార్లు తెలంగాణ డిమాండ్ కోసం, తెలంగాణ సమస్యల గురించి ఎన్నిసార్లు మాట్లాడారన్న వాస్తవాలు వివరించేందుకు టీడీపీ నాయకత్వం సిద్ధమవుతోంది. ఆ మేరకు లోక్‌సభ సెక్రటేరియేట్‌లో ఆ పార్టీ ఎంపీల రికార్డులను సేకరిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీ సభ్యుడు దయాకర్ రావు బాబ్లీపై రాజీనామా ఇవ్వడమే కాకుండా, లోక్‌సభ ఆవరణలో ధర్నా చేసిన వైనాన్ని గుర్తు చేయనుంది.

### దర్శకుడు తేజపై
## హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సినీ దర్శకుడు తేజ వర్సెస్ సినీ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వివాదం ఎట్టకేలకు మానవ హక్కుల కమిషన్‌కు చేరింది. తేజ తన ఇంటిని ఆక్రమించుకున్నాడనీ నాలుగు రోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన చదలవాడ శ్రీనివాసరావు తనకు న్యాయం జరగడంలేదని రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు ఈ కేసు విషయంలో ఇది సివిల్ తగాదా అనీ, దీనిని సివిల్‌కోర్టులో తేల్చుకోవాలని స్పష్టం చేయడం వల్లే తాను హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు శ్రీనివాసరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన హక్కుల కమిషన్ బుధవారం సాయంత్రం వరకు ఈ కేసుకు సంబందించిన పూర్తి వివరాలు వెల్లడించాలని బంజారాహిల్స్ ఎసీపీని మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సుభాషణ్‌రెడ్డి ఆదేశించారు.

**నాగవైష్ణవి కేసులో...**

విజయవాడలో దుండగులు కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చిన నాగవైష్ణవి కుటుంబ సభ్యులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించినప్పటికీ, దుండగుల స్నేహితులు ఫోన్‌ద్వారా బెదిరిస్తున్నారనీ, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. మంగళవారం నాగవైష్ణవి తల్లి నర్మదాదేవి, బాబాయి కలిసి వెళ్ళి జస్టిస్ సుభాషణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ నాగవైష్ణవి కిడ్నాప్, హత్య కేసుకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించడంతోపాటు వారి కుటుంబసభ్యులకు అందిస్తున్న భద్రతా వివరాలను వెల్లడించాలని విజయవాడ కమిషనర్‌ను ఆదేశించారు.